ప్రజాశక్తి

ఆదివారం 13 నవంబర్ 2022

I



అల్లూరి సీతారామరాజు

సంక్షేమ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-హుకుంపేట:అర్హత ఉన్న ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలు పొందాలని జెడ్పిటిసి రేగం మత్స్య లింగం కోరారు. మండలంలోని మారుమూల దుర్గం పంచాయతీలో జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గ్రామాల్లో ఆరోగ్యం, విద్యా, రోడ్లు, పారిశుధ్యం వంటి వాటిపై ప్రజలతో సమీక్ష నిర్వహించారు. సమస్యలను అధికార్ల దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం తగిన కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ వెంకటరావు, మధు, మంగళయ్య, సూరిబాబు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న జడ్పిటిసి

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో

కలెక్టర్ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-పాడేరు:మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన పాడేరు మండలం జామిగూడ, పెదబయలు మండలం బూసిపుట్టు పంచాయతీ పలు గ్రామాలలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ముంచింగిపుట్టు ప్రధాన కేంద్రంలో ఇద్దరు వ్యక్తులు అనుమతి లేని యాప్‌తో రైతులకు రిజిస్ట్రేషన్ చేయడం గమనించి వారిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎస్సైను ఆదేశించారు. ముంచింగిపుట్టు నుంచి బూసి పుట్టు చేరుకున్న కలెక్టర్ 104 వాహనం ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 104 వాహనం తిరిగే షెడ్యూల్ను ముందుగానే గ్రామస్తులకు తెలియజేయాలని సూచించారు. స్కానింగ్ అవసరమైతే గర్భిణీలు ముంచింగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలని, అవసరమైన పరికరాలతో పాటు శిక్షణ పొందిన డాక్టర్ ఉన్నారని తెలిపారు. జామిగూడ గ్రామంలో సందర్శించిన కలెక్టర్‌న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి మార్చి నాటికి పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కొజ్జారిగూడ, జాడిగూడ, గుంజువాడ, తారకి, జామిగూడ, పిన రావిల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఉపాధ్యాయులు వారానికి ఒక్కరోజే వచ్చి వెంటనే వెళ్ళిపోతున్నారని ఆయా గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ, ఏ టి డబ్ల్యూఓలు సోమవారం వ్యక్తిగతంగా కలవాలని ఆదేశించారు. కొజ్జారిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు మనబడి నాడు నేడు ఫేజ్ 1 కింద 18 లక్షలు మంజూరు కాగా ఎటువంటి పనులు చేపట్టలేదని సర్పంచ్, ఎంపీటీసీ, తదితరులు ఇచ్చిన ఫిర్యాదుతో పూర్తి నివేదిక అందజేయాల్సిందిగా ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ ని ఆదేశించారు. కొజ్జారిగూడ గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి అక్టోబర్ నెలకు సరఫరా అయిన పాలు, గుడ్లు, ఇతర రేషన్ అర్హులకు ఇంటికి అందించాలని, నవంబర్ నెల కోటాను ఇండ్లకు అందించాలని ఆదేశించారు. జామిగూడ పంచాయతీ పరిధి 14 గ్రామాల్లో 11 గ్రామాలకు 56 లక్షలతో జలజీవన్ మిషన్ కింద నీటి సరఫరా పనులు మంజూరయ్యాయని, ఇందులో మిగిలిన నిధులతో మిగిలిన మూడు గ్రామాలకు నీటి సరఫరా పథకాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఒక ఇంటి బయట ఉన్న వంతల బొజ్జయ్య దీనమైన ఆరోగ్య పరిస్థితిని గమనించిన కలెక్టర్ అతనికి కావలసిన సహాయం అందించాలని ఆదేశించారు. బూసిపుట్టు గ్రామ సచివాలయ భవనం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్ సదరు కాంట్రాక్ట్‌ను రద్దు చేయడంతో పాటు, అతనికి అప్పగించిన మిగిలిన కాంట్రాక్టులను కూడా రద్దుచేసి వేరొకరి తో పూర్తి చేయించాలని ఆదేశించారు. జామి గూడ నుంచి ఆంధ్ర, ఒడిశా బోర్డర్ వరకు సరైన రహదారి సౌకర్యం లేనందున కొంత దూరం జీపులో వెళ్లి సర్పంచ్‌తో ద్విచక్ర వాహనంపై ప్రయాణించి రోడ్డు పరిస్థితిపై ఆరా తీశారు. ఈ పర్యటనలో సర్పంచ్, ఎంపీటీసీ, అధికారులు పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్

బ్యాంకు మిత్రలు కమీషన్ వసూలు చేస్తే చర్యలు

ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లలో పని చేస్తున్న బ్యాంకు మిత్రలు ఖాతాదారుల నుండి కమీషన్ లకు ఆశపడి అధిక వసూలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. మండలంలో కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. రెండవ శనివారం కావడంతో స్థానిక ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు మూతబడి ఉన్నప్పటికీ గ్రామీణ బ్యాంక్ మిత్రలు బ్యాంకు ఆవరణలో ఆధార్ పేమెంట్‌లు చేస్తున్నట్లు గతంలో కలెక్టర్ దృష్టికి రావడంతో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. బ్యాంకు మిత్రలు ఖాతాదారుల నుండి రూ.1000కు రూ.20 నుండి 30ల వరకు అధికంగా వసూలు చేస్తుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, ఏపీజీవీబీ, ఎస్ బిఐ బ్యాంకు మిత్రల వద్ద ఆధార్ పేమెంట్‌లు చేసుకున్నప్పుడు ఉచితంగా పేమెంట్లు చేయాలన్నారు. కమీషన్లకు పాల్పడే వారి ఐడి కార్డు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.మండల కేంద్రంలోని ఉన్న ఎస్‌బిఐ ఎటిఎంలో సక్రమంగా ఆర్థిక లావాదేవీలు జరపక పోవడంతో ప్రైవేట్ ఏటీఎం, స్పైస్ మని, పే నియర్ బై, ఎయిర్టెల్ పేమెంట్, ఇరూపే వంటి తదితర ఆధార్ పేమెంట్ కేంద్రాల వద్దకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు.

గిరిజన పాఠశాలల్లో

సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- పాడేరులో 20న విద్యా సదస్సు
- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-పాడేరు:రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అనేక సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు తెలిపారు. గత మూడేళ్లుగా విద్యా రంగంలో నెలకొన్న సమస్యల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళితే పరిష్కరించలేదన్నారు. స్థానిక విలేకరుల సమావేశంలో శనివారం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఇటీవల రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల పరిధిలో యుటిఎఫ్ నిర్వహించిన జీపు జాతాల ద్వారా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వచ్చాయని చెప్పారు. వీటి పరిష్కార నిమిత్తం ఈనెల 20న పాడేరులో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గిరిజన ఆశ్రమాల్లో విద్యార్థులు అర్ధాకలితో చదువులు సాగిస్తున్నారని, 2019 నుంచి మెస్ ఛార్జీలను ప్రభుత్వం పెంచలేదని చెప్పారు. విద్యార్థులకు కాస్మోటిక్ ప్రభుత్వం సరఫరా చేయలేదని తెలిపారు. విద్యార్థులకు ఐదు జతలకు గాను రెండు జతలే ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఆశ్రమాల్లో హెల్త్ వాలంటీర్లు, ఏఎన్ఎంలను నియమించక పోవడంతో పిల్లలకు అనారోగ్యం వస్తే ఉపాధ్యాయులే ఆసుపత్రులకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. గిరిజన బాలిక ఆశ్రమాల్లో ప్రహరీలు లేవని చెప్పారు.
గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సగం మంది సీఆర్టీలే ఉన్నారని, వీరికి ప్రభుత్వం ఏడాదికి 10 నెలలకే జీతం ఇస్తోందని ఆయన చెప్పారు. జీవో 3ని పునరుద్ధరించాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారులుగా నియమించి, ఖాళీగా ఉన్న పాడేరు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల్లో డిప్యూటీ డీఈవో పోస్టులను అర్హులైన గిరిజన ఉపాధ్యాయులకే పదోన్నతుల కల్పించాలని డిమాండ్ చేశారు. 524 పండిట్, పిఈటి పోస్టులను అప్‌గ్రేడేషన్ చేయాలని చెప్పారు. గిరిజన ప్రాంతంలో భాష వాలంటీర్ల నియామకంపై అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చొరవ తీసుకున్నప్పటికీ ఐటిడిఏ పిఓ గోపాలకృష్ణ అభ్యంతరాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో భాష వాలంటీర్ల నియమాకం ఆవశ్యమని చెప్పారు. జిల్లా కలెక్టర్ చెప్పినా పీవో స్పందించక పోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైతే తాము భాష వాలంటీర్లతో ఐటీడీఏను ముట్టడిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న పాడేరులో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఈ సదస్సు పోస్టర్లను ఆయన జిల్లా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ బాబు, సహా అధ్యక్షురాలు కవిత, గౌరవ అధ్యక్షుడు టి.చిట్టిబాబు, కార్యదర్శులు పి.కృష్ణయ్య, కె.రఘునాథ్, వెంకట నారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు,సిపిఎస్ సబ్ కమిటీ ఎల్.నారాయణ, సీనియర్ నాయకులు ఎస్.రాంబాబు, పి.దేముడు, కర్రి బాబు, ఎన్.కొండబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ఏరియా ఆసుపత్రిలో శిశువు మృతి

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ ఏరియా ఆసుపత్రిలో చిన్నలబుడు పంచాయితీ మాలివలస గ్రామానికి చెందిన పాంగి వాహిని(24) రెండో కాన్పు బిడ్డకు జన్మనిచ్చిన కొద్దిసేటికే శిశు మరణించిందని బాధితురాలి భర్త నరసింగరావు ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో పుట్టిన మగ బిడ్డ ఐదు రోజులు తర్వాత కేజిహెచ్‌లో తరలిస్తుండగా మధ్య మార్గంలో మృతి చెందాడని తెలిపారు.ఆసుపత్రిలో సరైన వైద్యం అందక పోవడంతో శిశువు మరణించిందని సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు తెలిపారు. ఆయన శనివారం ఏరియా ఆసుపత్రిలో సందర్శించి శిశు మరణం పై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రిలో గైనిలాజిస్ట్, వైద్య సిబ్బంది లేక పోవడంతో శిశు మృతి చెందడం జరిగిందని అన్నారు. అరకులోయ ఏరియా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు పరికరాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేక చాలామంది చని పోతున్నారని అన్నారు. ఈ ఆస్పత్రిలో చికిత్స పొందాలంటేనే గిరిజనులు భయపడుతున్నారని చెప్పారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న సిపిఎం నేత రామారావు



మృతి చెందిన శిశువు

ప్రధాని పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమిటి

విభజన హామీలపై మాట్లాడని పిఎం - సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు:ప్రత్యేక హెూదా, రైల్వేజోన్, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి ఊసెత్తని ప్రధాని మోడీ పర్యటనతో రాష్ట్రానికి ఇటువంటి ప్రయోజనం చేకూరలేదని, ముఖ్యమంత్రి జగన్ కూడా వీటిపై మోడీని ప్రశ్నించలేదని సిపిఎం జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స తెలిపారు విశాఖ బహిరంగ సభలో మోడీ ప్రసంగం వింటే రాష్ట్రానికి ఇక చేయాల్సిందేమీ లేదన్నట్లు ఉందని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని హిందీలో మాట్లాడితే, సిఎం జగన్ తెలుగులో మాట్లాడారని, ఒకరి భావాలు ఒకరికి అర్థమైనట్లు అనిపించ లేదని ఎద్దేవా చేశారు. పార్లమెంటులో ఆమోదించిన విభజన చట్టం అమలును విస్మరించిన విధంగానే మోడీ ప్రసంగం సాగిందని తెలిపారు. విభజన చట్టం, హెూదా, పోలవరం ప్రాజెక్టు ముంపులో గిరిజనులకు తీవ్ర అన్యాయంపై కనీస వివరణ ఇవ్వలేదని విమర్శించారు. అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లు 22ను రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదని తెలిపారు.ప్రజలకు ఏ మాత్రమూ ఉపయోగపడని పర్యటనతో డబ్బు, సమయం వీధా చేశారని విమర్శించారు. కేవలం స్వప్రయోజనాల కోసం సభ నిర్వహించినట్లు ఉందని తెలిపారు. కేంద్రం తీరుపై అన్ని రాష్ట్రాల్లోనూ తీవ్ర వ్యతిరేకత వ్య క్తమవుతుంటే ఎపిలో మాత్రం అధికార, ప్రతిపక్షాలు కేంద్రానికి భజన చేసే పనిలో ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై ప్రశ్నించేందుకు సిద్ధమైన వామపక్షాల నాయకులను అరెస్టు చేసి ఇబ్బందులు పెడుతున్నారని, రానున్న ఎన్నికల్లో బిజెపిని ఓడించడమే ధ్యేయంగా సిపిఎం పని చేస్తుందని తెలిపారు.



బస్సులు లేక బోసిపోయిన పాడేరు ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్

ఎక్కడ ప్రయాణికులు అక్కడే..!

ప్రధాని సభకు తరలిన మెజార్టీ ఆర్‌టిసి బస్సులు
గంటల తరబడి రోడ్లపై, బస్‌స్టేషన్లలో పడిగాపులు
మారుమూల, గ్రామీణ ప్రాంతంలో మరీ దారుణం
అదును చూసి ఆటోలు, ప్రైవేటు వాహనదారుల దోపిడీ

విశాఖ ఎయు గ్రౌండ్‌లో ప్రధాని మోడీ సభకు ఉమ్మడి విశాఖ జిల్లాల్లోని ఆర్‌టిసి డిపోల నుంచి మెజార్టీ బస్సులను జనసమీకరణకు తరలించడంతో, రాకపోకలకు ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. గ్రామీణ ప్రాంతంలో అనేక రూట్లలో బస్సులు పూర్తిగా నిలిచిపోగా, రద్దీ ఉన్న రూట్లలో కొద్దిబస్సులే తిరగడంతో గమ్యస్థానాలు చేరుకోవడానికి ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. ఇదే అదనుగా ఆటోవాలాలు, ప్రయివేటు వాహనదారులు రెట్టింపు మించి ఛార్జీలను వసూలు చేసి ప్రజల జేబులకు చిల్లుపెట్టారు. (ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

పాడేరు డిపో నుంచి 30 బస్సులు మళ్లింపు

పాడేరు.: అల్లూరి జిల్లాలో ఏకైక ఆర్‌టిసి బస్సు డిపో పాడేరు నుంచి 30బస్సులను విశాఖలోని ప్రధాని మోడీ సభకు మళ్లించడంతో దాదాపు 90శాతం సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో మన్యవాసులు గంటలకొద్దీ బస్సుల రాక కోసం పడిగాపులు పడుతూనానా అవస్థలు పడ్డారు. పాడేరు నుంచి చింతపల్లి జోలాపుట్టు, అరకు, డొంకరాయి, రాజమండ్రి, కాకినాడ, చోడవరం ప్రాంతాలకు ఒక్కో బస్‌సర్వీసు మాత్రమే నడిచింది. నిత్యం రద్దీగా ఉండే విశాఖపట్నం పాడేరు బస్ సర్వీసులు కూడా బాగా తగ్గించి, కేవలం రెండు బస్సులే తిప్పారు. దూర ప్రాంతాలకు బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు పాడేరు బస్ కాంప్లెక్స్‌లోనే గంటల కొద్ది పడిగాపులు పడ్డారు. అరకు, చింతపల్లి, చోడవరం, పెదబయలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి, అధిక ఛార్జీలను చెల్లించి గమ్యాలను చేరుకున్నారు. ఇక జోలాపుట్, మంప, జీకే వీధి, గోమంగి తదితర దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు పూర్తిగా లేకపోవడంతో ప్రయాణికులు పాడేరు బస్‌కాంప్లెక్స్‌లోనే నిరీక్షించారు.మోడీ పర్యటనకు బస్సులన్నీ తరలించి, అవస్థలు పాల్జేసిన ప్రభుత్వం, ఆర్‌టిసిపై ప్రయాణికులు నిరసన వ్యక్తం చేశారు.

అనకాపల్లి : విశాఖపట్నంలో ప్రధాని మోడీ బహిరంగ సభకు అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలోని200బస్సులకు గాను 150 బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మిగిలిన పావు వంతు బస్సులను నర్సీపట్నం, విజయనగరం, చోడవరం తదితర ప్రాంతాలకు తిప్పడంతో మిగిలిన రూట్లలో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. కొన్ని రూట్లలో నాలుగైదు గంటలకుగానీ ఒక బస్సు రాకపోవడంతో ఉదయం నుంచి పిల్లా పాపలతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఏ బస్సు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితితో ఎంక్వైరీ కౌంటర్ వద్ద సిబ్బందితో ప్రయాణికులు వాగ్వాదానికి దిగారు.దీంతో ప్రజలు గమ్యస్థానాలను చేరుకునేందుకు తప్పనిసరిగా ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా, ఇదే అదనుగా వారు చేతివాటం చూపించారు. ఎపుడూ వసూలు చేసే ఛార్జీల కంటే మూడు, నాలుగు రెట్లు అధికంగా వసూలు చేశారు.

గాజువాక : గాజువాక, విశాఖ స్టీల్‌సిటీ డిపో నుంచి అనేక బస్సులను మోడీ సభకు తరలించడంతో కనీసస్థాయిలో సిటీ బస్సులు లేక ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. గాజువాక 38 బస్టాప్, శ్రీనగర్, కొత్త గాజువాక, నాతయ్యపాలెం బస్‌స్టాపుల వద్ద ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు పడ్డారు. చివరకు అధిక ఛార్జీలు చెల్లించి ఆటోలను ఆశ్రయించి వెళ్లాల్సి వచ్చింది. గాజువాక, గోపాలపట్నం వరకు రెగ్యులర్‌గా ఆటోలున్నా, అటుగా పెందుర్తి, కొత్తవలస, సింహాచలం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నర్సీపట్నం టౌన్: నర్సీపట్నం డిపోకు చెందిన 100 బస్సులకు గాను 76 బస్సులు విశాఖపట్నం సభకు తరలించారు. నర్సీపట్నం ప్రాంతం నుండి తుని వెళ్లే అన్ని బస్సులు రద్దయ్యాయి. దీంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లాల్సిన ప్రయాణికులు అవస్థలు పడ్డారు. చోడవరం, అనకాపల్లి బస్సులు రద్దయ్యాయి. ఏజెన్సీ ప్రాంతమైన చింతపల్లి ఒక బస్సు తిరుగుతుండగా కేడీపేట, కొయ్యూరు వైపు ఒక బస్సే తిరిగింది. దీంతో, ప్రయాణికులు అనేక ఇక్కట్లు పడ్డారు. తగ్గించడంతో బస్సుల్లో సీటు మాత్రం దేవుడెరుగు, కనీసం వేలాడైనా గమ్యాలను చేరుకునేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు. ఆర్‌టిసి బస్‌స్టేషన్‌లో పిల్లాపాపలతో గంటల తరబడి పడిగాపులు పడి, చివరకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వెళ్లారు.

తగరపువలస : ప్రధాని సభకు భారీగా బస్సులు తరలిన నేపథ్యంలో విశాఖ, మద్దిలపాలెం తదితర డిపోల ఆర్‌టిసి బస్సులు తగరపువలస రాకపోవడంతో నిత్యం రాకపోకలు సాగించే ఉద్యోగులు, విద్యార్థులు, ఉపాధికోసం వచ్చే వందలాది మంది అవస్థలు పడ్డారు. బస్‌పాసులన్నా అధిక మొత్తంలో ఛార్జీలను చెల్లించి అవస్థలు పడ్డారు.

సింహాచలం: ప్రధాన మోడీ బహిరంగ సభకు ఆర్టీసీ బస్సులు వెళ్లిపోవడంతో, సింహగిరిపై అప్పన్న దర్శనానికి వచ్చిన భక్తులు అవస్థలు పడ్డారు. దేవస్థానం బస్సులు పరిమిత సంఖ్యలో ఉండడంతో కొండెక్కి,దిగడానికి గంటల తరబడి క్యూలైన్లలో వేచిఉండక తప్పలేదు.



పాడేరులో బస్సుల కోసం పడిగాపులు పడుతున్న ప్రయాణికులు

నిరాశపరి-చిన మోడీ సభ

రేఖపల్లిలో సిపిఎం ఆధ్వర్యాన 'మోడీ గోబ్యాక్' నిరసన


ప్రజాశక్తి-విఆర్.పురం : ప్రధాని మోడీ పర్యటనతో ఆంధ్రాకు గానీ, ఉమ్మడి విశాఖ జిల్లాకు గానీ ఒరిగిందేమీ లేదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ విమర్శించారు. శనివారం మోడీ పర్యటనను నిరసిస్తూ రేఖపల్లి జంక్షన్ వద్ద సిపిఎం ఆధ్వరంయలో నిరసన చేపట్టారు. మోడీ గోబ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా సిపిఎం మండల నాయకుడు పూలు సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెస్తున్న అటవీ సంరక్షణ చట్ట సవరణ బిల్లు తక్షణమే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఏజెన్సీలో స్థానికులకే శతశాతం ఉద్యోగావకాశాలను కల్పించే జిఓ 3 పునరుద్ధరణకు ప్రధాని మోడీ స్పష్టమైన హామీనివ్వాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, ఉక్కు ఉద్యోగులు 638రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్రం మొద్దునిద్ర వీడకపోవడం దారుణమన్నారు. విభజన హామీల అమలు, విశాఖ స్టీల్‌ప్లార్ పరిరక్షణపై సిఎం జగన్‌తోపాటు జనసేనాని పవన్‌కల్యాణ్ కేంద్రాన్ని ప్రశ్నించాలని కోరారు. పోలవరానికి నిధులు మంజూరుచేసి, ముంపు బాధితులు, నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. విశాఖ రైల్వేజోన్, ఎపికి ప్రత్యేకహోదా,ఇతర విభజన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, పంపు సత్తిబాబు, జి. లక్ష్మణరావు శ్రీరామమూర్తి, సత్యనారాయణ హజరత్, వడ్లాది. రమేష్, తుర్రం బాబురావు, ప్రకాష్ వీర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

భీమవరంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

మారేడుమిల్లి : ఆంధ్ర రాష్ట్రానికి, ప్రజలకు ప్రధాని మోడీతోపాటు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని ద్రోహం అన్యాయం చేస్తోందని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఇ.సిరిమల్లిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీ భీమవరం గ్రామంలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ గోబ్యాక్ అంటూ నిరసన చేపట్టి నినాదాలు చేశారు. మోడీ దిష్టి బొమ్మను గ్రామస్తులు దహనం చేశారు. ఈ సందర్భంగా .సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ ఎపికి అన్యాయం చేసిన మోడీ రాకను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విభజన హామీలతో పాటు నిరుద్యోగులకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, ఎపికి గిరిజన వర్సిటీ, మన్యంలో మెడికల్ ర్సిటీ వంటి ఎన్నో హామీలను అమలు చేయలేదన్నారు ఆంధ్రాకు పరిశ్రమల్లో గుండెకాయ లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తూ, అదే విశాఖలో బహిరంగ సభ పెట్టడానికి మోడీకి సిగ్గు లేకపోగా, వారికి సాదర ఆహ్వానం పలికి జనసమీకరణ చేయడం ద్వారా జగన్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను అగౌరవపరిచిందని మండిపడ్డారు. కార్యక్రమంలో గిరిజన సంఘం సహాయ కార్యదర్శి బి. మల్లిరెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు, సర్పంచ్ ఇ. మల్లీశ్వరి గ్రామస్తులు ఈ జ్యోతి, బి నాగమణి, బి లచ్చిరెడ్డి, కె. పార్వతి పాల్గొన్నారు.



మోడీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న గిరిజన సంఘం నేతలు

30లోగా ఉచిత శిక్షణకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి- విఆర్ పురం: పోలీసు శాఖల్లో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్ ఉద్యోగ నియామకాల ఉచిత శిక్షణకు గిరిజన యువతీయువకులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్థానిక ఎస్ఐ టి దుర్గాప్రసాద్ కోరారు. గత నెల 27నుంచి ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ కోసం అభ్యర్థుల పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకుంటామన్నారు. సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, ఎఆర్, ఎస్ఎస్‌పి, ఐటిబిపి వంటి వివిధ పోలీసు విభాగాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల నియామకాలకు అవసరమైన శిక్షణ అందజేస్తామన్నారు. అభ్యర్థులు 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి, యువకులైతే 162.5 సెం.మీ, యువతులు 150 సెం.మీ.ఎత్తు, వయసు 18 నుంచి 28 లోపు ఉండాలన్నారు. స్ఫూర్తి కార్యక్రమం ద్వారా ఐటిడిఎ, పోలీసుశాఖ వారి ఆధ్వర్యంలో భోజనం, వసతి సౌకర్యం కల్పించి, ఉచిత శిక్షణ అందిస్తామన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-కూనవరం : అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగభద్రత కల్పించడంతోపాటు కనీస వేతనం నెలసరి రూ.26వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం కోతుల గుట్టలో ఎపి అంగన్వాడీ యూనియన్ (సిఐటియు) కూనవరం మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ అంగన్వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, .కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేసి ఉద్యోగం భద్రత కల్పించాలని కోరారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కార్మిక హక్కులను కాపాడాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

ఈ సందర్భంగా కూనవరం మండల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా మడెం అన్నపూర్ణ, పి. లక్ష్మి ప్రసన్న, కమిటీ సభ్యులుగా తెల్లం ముత్తమ్మ, సైకం లలిత, ముచ్చిక అరుణ, కట్టం రాములమ్మ, వెంకట రమణ, సోడే అర్జమ్మ, మడెం వసంత, సరియం లక్ష్మితోసహా 13మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పూనెం సత్యానారాయణ, మండల కార్యదర్శి కొమరం పెంటయ్య పాల్గొన్నారు



యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు అన్నపూర్ణ, లక్ష్మీప్రసన్న



మాట్లాడుతున్న శాంతిరాజు

భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం

ప్రజాశక్తి - రంపచోడవరం : మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు విమర్శించారు. శనివారం రంపచోడవరంలోని యూనియన్ జిల్లా కార్యాలయంలో కడబాల, గంగ అధ్యక్షతన మధ్యాహ్నం భోజన కార్మికుల నూతన ప్రథమ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా శాంతిరాజు మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం కార్మికులకు సక్రమంగా, సకాలంలో ప్రతినెల ఐదో తేదీకి వేతనాలు, బిల్లులు చెల్లించాలని, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని, ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు. భోజన కార్మికుల సమస్యల పరిష్కరానికి అందరూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ప్రథమ మహాసభలో నూతనజిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సోల్లం, పద్మ, కార్యదర్శిగా కడబాల గంగతోపాటు 13 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. కార్యక్రమంలో గిరిజన సంఘం రంపచోడవరం మండల కార్యదర్శి తీగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంగీత ప్రవీణ జోగులాంబ మృతి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ నగరానికి చెందిన ప్రముఖ సంగీత విద్యా ప్రవీణ మల్లాప్రగడ జోగులాంబ శనివారం తెల్లవారుజామున మరణించారు. ఆమె దేశ విదేశాలలో విరివిగా పర్యటించి అనేక సంగీత కచేరీలు నిర్వహించారు. పలు అవార్డులు అందుకున్నారు. సంగీత కళా సాగర వంటి విశిష్ట అవార్డు అందుకున్న జోగులాంబ వీణా నిలయ విద్వాంసులుగా ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో రెండు దశాబ్దాలు పైబడి సేవలందించారు. అనేకమంది లబ్ధప్రతిష్టులైన శిష్యులను తయారుచేసిన జోగులాంబ చరితార్థులు. ఆమె లేనిలోటు తీరనిది, పూడ్చలేనిదని పలువురు వ్యాఖ్యానించారు.

కొత్త ప్రాజెక్టులేవీ ? : మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినవన్నీ గతంలో మంజూరు కాబడినవేనని, వాటికి సంబంధించిన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయని, అయితే.. ఇవన్నీ వైసిపి ప్రభుత్వం సాధించినవని అర్థం వచ్చేలా ముఖ్యమంత్రి జగన్, ఎంపీ విజయసాయిరెడ్డి డబ్బా కొట్టుకుంటున్నారని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రత్యేక హోదా తెచ్చారా, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా హామీ సాధించారా, రైల్వే జోన్ భవనం శంకుస్థాపన ఏమైంది ? అని ప్రశ్నించారు. టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ మోడీ శంకుస్థాపన చేసిన ఏ ఒక్క ప్రాజెక్టూ ముఖ్యమంత్రి జగన్ తెచ్చింది కాదన్నారు. పార్టీ దక్షిణ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బా కొట్టుకున్న ప్రధాని మోడీ : సిపిఐ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోడీ సొంత డబ్బా కొట్టుకునేందుకు ప్రయత్నించారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి విమర్శించారు. విశాఖలో ప్రధాని మోడీ పర్యటన ముగిసిన తరువాత అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో చేసిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వల్ల విశాఖకు ఏదో ఒనగూరుతుందని చెప్పారని, వాస్తవానికి వాటి వల్ల పెద్ద ప్రయోజనం లేదని అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల గురించి ప్రధానిని ముఖ్యమంత్రి జగన్ గట్టిగా అడగలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. ప్రధాని సభకు డ్వాక్రా మహిళలను బెదిరించి తరలించారని విమర్శించారు. సమావేశంలో పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు ఎ.విమల, ఎస్‌కె.రెహమాన్, క్షేత్రపాల్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనతోనే దేశ ప్రగతి

విశాఖ సభలో ప్రధాని మోడీ
పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
సభకు భారీగా జనాన్ని తరలించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

మౌలిక సదుపాయాల కల్పనతోనే దేశ ప్రగతి సాధ్యమని ప్రధాని మోడీ అన్నారు. విశాఖపట్నానికి చాలా విశిష్టమైన వర్తక, వ్యాపార సంప్రదాయాలు ఉన్నాయని, ఇదో అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్ని రంగాల్లో తమకంటూ ఒక ప్రముఖ పేరు తెచ్చుకున్నారని కితాబిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లతో కలిసి ఆయన శనివారం రూ.10,742 కోట్ల విలువైన బహుళ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విశాఖపట్నం ఒక ముఖ్యమైన ఓడరేవుగా పేరుగాంచిందన్నారు. బ్లూ ఎకానమీపై ప్రభుత్వ దృష్టిని ఆయన నొక్కి చెప్పారు. సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ 'చారిత్రక ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలో ఒకవైపు సముద్రం కనిపిస్తోంది, మరోవైపు జనసముద్రం కనిపిస్తోంది' అని అన్నారు. కార్తీక పౌర్ణమివేళ ఎగసిపడిన కెరటాలకు మించి ఈరోజు జనకెరటం ఇక్కడ ఉవ్వెత్తున ఎగిసిపడుతూ కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఇక్కడకి వచ్చిన జనాభాను చూస్తుంటే ప్రజాకవి, గాయకుడు వంగపండు చెప్పినట్టుగా..పాడినట్టుగా.. ఆయన మాటలు గుర్తుకొస్తున్నాయన్నారు. ఏం పిల్లడో ఎల్దామొస్తవా అన్న పాటను గుర్తు చేశారు. ఇదే నేలమీద నడియాడిన మహాకవి శ్రీశ్రీ మాటల్లో చెప్పాలంటే.. వస్తున్నాయ్.. వస్తున్నాయ్ జగన్నాథ రథచక్రాలొస్తున్నాయ్ అంటూ కదిలివస్తున్న లక్షల జనసందోహం తన కళ్ల ముందు కనిపించిందన్నారు. దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్ అన్న విజయనగరం వాసి, మహాకవి గురజాడ మాటలు మనందరికీ కర్తవ్య బోధ చేస్తున్నాయన్నారు. ఎనిమిదేళ్ల క్రితం తగిలిన అతిపెద్ద గాయం నుంచి ఆంధ్రప్రదేశ్ ఇంకా కోలుకోలేదన్నారు. కేంద్ర రైల్వే శాఖామంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ ఎపికి కేటాయించిన ఆర్థిక వనరులు, చేపట్టిన అభివద్ధి ప్రాజెక్టులను వివరించారు. విశాఖపట్నం రైల్వేస్టేషన్, ఫిషింగ్ హార్బర్ ఆధునీకరణ, అప్ గ్రేడేషన్ కొరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


రిమోట్‌తో ప్రాజెక్టులను ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ, చిత్రంలో గవర్నర్, సిఎం

భారీ ఏర్పాట్లు

ప్రధాని మోడీ బహిరంగ సభకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఈ ఏర్పాట్లలో భాగంగా ప్రధాన సభా వేదిక ఏర్పాటు చేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో మొత్తం ఏడు మార్గాల ద్వారా అతిథులు, ప్రజలు సభాస్థలికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు. సభాస్థలికి ప్రజలను విశాఖపట్నంలోని 98 వార్డుల నుంచి తరలించారు. విజయనగరం పార్వతీపురం అనకాపల్లి, శ్రీకాకుళం అల్లూరి జిల్లాల నుంచి ఆర్టీసీ బస్సులు, స్కూళ్లు, కాలేజీలు, ఫార్మా కంపెనీలకు చెందిన బస్సులను జనాల తరలింపునకు ఉపయోగించారు. సభ ప్రారంభమై ముగిసే సమయానికి కూడా చాలామంది ప్రజలు బస్సులలో సభా స్థలానికి చేరుకుంటూనే ఉన్నారు. ప్రధాన వేదిక మీద ఉన్న అతిథులు అందరికీ కనపడే విధంగా సుమారు 500 ఎల్ఇడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

సభ అనంతరం తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలు

ఇదంతా ఒక ఎత్తైతే సభ ముగిసిన అనంతరం అధికారులు, పోలీసు యంత్రాంగం ప్రజలను గాలికి వదిలేసింది. ప్రజలు బయటికి వచ్చే క్రమంలో దారులు తెలియక ఇబ్బందులు పడ్డారు. ఏ బస్సు ఎక్కి తమ ప్రాంతాలకు తిరిగి వెళ్ళాలో తెలియక సతమతమయ్యారు. మద్దిలపాలెం నుండి సత్యం జంక్షన్ వరకు ప్రజలు రోడ్లపై గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది వారికి సరైన సమాచారం ఇచ్చేవారు కరువయ్యారు.

సాయంత్రం నాలుగు గంటలు అవుతున్నప్పటికీ వేలాదిమంది మద్దిలపాలెం, సత్యం జంక్షన్, పోలమాంబ గుడి, పెద్ద వాల్తేరు ప్రాంతాలలోనే కనిపించారు. ప్రజలను సభకు సమీకరించేటప్పుడు తీసుకున్న శ్రద్ధను సభ ముగిసన తరువాత ఎవ్వరూ చూపలేదు.

విశాఖ సాక్షిగా కేంద్రం మరోసారి ద్రోహం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, సిపిఎం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్, అనకాపల్లి

విశాఖ సాక్షిగా కేంద్రం మరోసారి ద్రోహానికి పాల్పడిందని, శనివారం జరిగిన బహిరంగ సభలో ప్రధాన మంత్రి మోడీ ప్రజల ఆకాంక్షలను కనీసంగా కూడా ప్రస్తావించలేదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక, సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు తెలిపాయి. ప్రధాని సభ మొక్కుబడిగా సాగిందని పేర్కొన్నాయి. సభలో మొక్కుబడిగా ముఖ్యమంత్రి ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ అంశాలను ప్రస్తావించినా, ప్రధాని నుంచి కనీస స్పందన కూడా లేదని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. ఇది రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని తెలిపారు. ప్రధాని సభా వేదిక నుంచి ప్రారంభించినవేవీ ఈ ప్రాంత ప్రజలు కోరుకున్నవి కావన్నారు. ఫిషింగ్ హార్బర్, విశాఖపట్నం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ వంటివన్నీ వారి కార్పొరేట్ మిత్రులకు సిరులు కురిపించడానికేనన్నారు. కొన్ని ఇప్పటికే పూర్తయిపోయినవేనని తెలిపారు. విశాఖ కేంద్రంగా రైల్వే జోన్, స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయం ఉపసంహరణ వంటి కనీస ప్రకటనలైనా ప్రధాని నుండి వస్తాయని ఆశించిన కొంతమంది ఆశలను కూడా ఆయన అడియాసలు చేశారన్నారు. వెనుకబడ్డ జిల్లాలకు తమ ప్రభుత్వం ఏదో చేసేసిందని ప్రధాని గొప్పలు చెప్పుకున్నారుగానీ, ఉత్తరాంధ్రకు రావలసిన నిధులు ఇవ్వలేదన్న సంగతి దాచేశారన్నారు

రామరాజుకు అభినందన

ప్రజాశక్తి- అడ్డతీగల : ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పి రామరాజు(రాజవొమ్మంగి)ను పలువురు అభినందించారు. ఈ నెల 10, 11 తేదీలలో గుడివాడలో జరిగిన ఫెడరేషన్ 7వ రాష్ట్ర మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ప్రతినిధులు హాజరు కాగా, 56 మందితో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. వారిలో రంపచోడవరం డివిజన్ నుండి రాష్ట్ర కమిటీ సభ్యులుగా రామరాజు ఎన్నికయ్యారు. రామరాజుకు సిఐటియు అడ్డతీగల మండల అధ్యక్షులు జి.సురేష్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏజెన్సీలోని భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సిఐటియు నాయకులు బి నిర్మల, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు రామారావు పలువురు రామరాజును అభినందించారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు గౌరీశ్వరి

ప్రజాశక్తి -సీలేరు: జిల్లా స్థాయిలో అండర్ -17 విభాగంలో వాలీబాల్ పోటీలకు తన కుమార్తె గౌరీశ్వరి ఎంపిక కావడంపై పోల్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక డిఎవి పాఠశాలలో ఎనిమిదో తరగతి వరకు చదివిన సిహెచ్. గౌరీశ్వరి ప్రస్తుతం అనకాపల్లి జిల్లా కశింకోట జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోందని, అక్కడి నుంచే వాలీబాల్ పోటీల్లో పాల్గొంటూ జిల్లాస్థాయికి ఎంపిక కావడంపై ఆనందం వ్యక్తం చేశారు. వాలీబాల్ క్రీడాకారునిగామంచి గుర్తింపు పొందిన పోల్‌కుమార్, తన కుమార్తె గౌరీశ్వరిని కూడా ఆ క్రీడలో ప్రోత్సాహించి, రాణించేలా తీర్చిదిద్దారు. ప్రస్తుతం జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన గౌరీశ్వరి అక్కడ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై అక్కడా రాణిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన గౌరీశ్వరిని డిఏవి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, ఇతర ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి -కూనవరం : రాజకీయ ప్రయోజనాల కోసం సర్వేల పేరుతో పోలవరం నిర్వాసితులను మోసం చేస్తూ, ఇబ్బందులకు గురిచేయడం దారుణమని సిపిఎం కూనవరం మండల కమిటీ కార్యదర్శి పాయం సీతారామయ్య విమర్శించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని ముఖ్యమంత్రి జగన్ ఎందుకు చెప్పారో బిజెపి నాయకులకు తెలియదాఅని ప్రశ్నించారు. జాతీయ ప్రాజెక్టుకు నిధులు ఎవరు ఇవ్వాలో కూడా తెలిసి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కొరకు పోరాడే వారిని విమర్శించే అర్హత బిజెపి నాయకులకు లేదన్నారు. 41 నుండి 48 వరకు కాంటూర్‌లో ఉన్న గ్రామాలను సర్వే చేసి, నిర్వాసిత ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.. సిపిఎం నాయకులు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు ఉన్నారు.

వేతన బకాయి చెల్లించండి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : తమకు రావల్సిన ఆరు నెలల జీతాల బకాయి చెల్లించాలని, అలాగే టిఎ, డిఎ, ఇతర అలవెన్సు అందించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సత్యసాయి సిబ్బంది కోరారు. ఈ మేరకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్‌పి చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్ అందజేసారు. శనివారం విలీన మండలాల పర్యటనలో భాగంగా చింతూరు వెళ్తున్న జెడ్‌పి చైర్మన్ వేణుగోపాల్‌తోపాటు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మిలను స్థానిక పార్టీ కార్యాలయంలో మండల వైసిపి నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. జెడ్‌పి చైర్మన్ వేణుగోపాల్‌కు పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్లె బాలాజీ బాబు, కోఆప్షన్ సభ్యుడు గురుకు దర్మరాజు, సున్నంపాడు ఎంపిటిసి అనిల్, పార్టీ కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, మండల కార్యదర్శి గంగరాజు, నాయకులు గొర్లె బాబీ, అనిదీప్ కుమార్, సురేష్, దేవి పాల్గొన్నారు..

తెలుగుజాతి ప్రయోజనాలు తాకట్టు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పలు అక్రమ ఆస్తుల కేసులలో అరెస్టు కాబడి బెయిల్‌పై ఉన్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బెయిల్ రద్దు అవుతుందనే భయంతో తెలుగుజాతి ప్రయోజనాలను ప్రధాని మోడీ వద్ద తాకట్టు పెట్టారని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నాడు మెడలు వంచుతానని ప్రగల్బాలు పలికి, నేడు విజ్ఞప్తులకే జగన్మోహన్ రెడ్డి పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని ప్రసంగించిన సభలో తాను పాస్ పొంది పాల్గొనగా, సిఐ రాంబాబు, ఎస్ఐ సత్యనారాయణ తన వద్దకు వచ్చి ఎస్‌పి రమ్మంటున్నారని చెప్పి సభ నుంచి తనను తీసుకెళ్లే ప్రయత్నం చేశారని చెప్పారు. తనను అవమానించారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ అంశంపై సిఎం ప్రధానిపై ఒత్తిడి తీసుకురాలేదన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల-1,2లలో స్థానిక సిహెచ్‌సి వైద్యాధికారిణి శిరీష ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. స్థానిక పాఠశాలలలో గిరిజన విద్యార్థులు గజ్జి వంటి చర్మవ్యాధులతో ఇబ్బంది పడుతున్నట్లు శుక్రవారం పలు వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చర్మ వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థులను పరిశీలించి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో వసతి గృహాలు, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. గజ్జి వంటి చర్మ వ్యాధులతో పాటు మలేరియా, డయేరియా, టిబి వంటి తదితర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గొడుగులు పంపిణీ చేస్తున్న సిఆర్‌పిఎఫ్ అధికారులు

గొడుగుల పంపిణీ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో హెలీ గ్రౌండ్ వద్ద సిఆర్పిఎఫ్ ఈ/198 బెటాలియన్ ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు శనివారం గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ/198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండర్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్, బాలల, మహిళల రక్షణ తదితర అంశాలపై గిరిజన ప్రజలకు అవగాహన కల్పించారు. యువత ఉపాధి కల్పనకు పోలీసులతో మమేకంగా ఉండాలని, ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన పొందాలని తెలిపారు. ఈ కార్య క్రమంలో స్థానిక ఎస్సై రవీందర్, ఈ /198 ఇన్స్పెక్టర్ ఎస్ఎన్ యాదవ్ పాల్గొన్నారు.

ఎయు శతాబ్ది ఉత్సవాలకు ప్రధానికి ఆహ్వానం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలు 2023 ఏప్రిల్‌లో ప్రారంభమవుతాయని, వీటిని ప్రారంభించడానికి రావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాద్‌రెడ్డి ఆహ్వానించారు. ఏయూ మైదానంలో ప్రధాని మోడీని విసి స్వాగతించారు. ఈ సందర్భంగా సర్ సిఆర్.రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్, సివి.రామన్, ఆచార్య సూరి భగవంతం వంటి మహనీయులందరూ ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి చేసిన విధానాన్ని ప్రధానికి వివరించారు. ప్రధాని చెప్పిన మేకిన్ ఇండియా నినాదాన్ని కార్యరూపంలో చూపే దిశగా ఆంధ్ర విశ్వవిద్యాలయం పనిచేస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరుగుతున్న చారిత్రక అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో కూడిన లేఖను ప్రధానమంత్రికి ప్రసాద్ రెడ్డి అందజేశారు. భారతదేశాన్ని ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఎయు పనిచేస్తుందని, దీనికి ప్రధానమంత్రి ఆశీస్సులు కావాలని విసి కోరారు.

1/70 చట్టాన్ని పటిష్టంగా అమలుచేయాలి

అక్రమ నిర్మాణాలు వెంటనే కూల్చాలి
అఖిలపక్ష నేతల డిమాండ్


మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

ప్రజాశక్తి హుకుంపేట: ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం పటిష్టంగా అమలు చేసి, అక్రమ నిర్మాణాలు వెంటనే కూల్చాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని గిరిజన సంఘం కార్యాలయం వద్ద శనివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, హుకుంపేటలో గిరిజనేతరులు అడ్డు, అదుపు లేకుండా అక్రమంగా ఇల్లు, షాపులు కడుతున్నా రెవిన్యూ అధికారులు ఎందుకు నిలుపుదల చేయలేదని ప్రశ్నించారు.గిరిజనులు చిన్న షాపు కట్టడానికి పునాదులు వేస్తే, క్షణాల్లో రెవెన్యూ సిబ్బంది అక్కడ వాలి పోయి, హెచ్చరించి కూల్చేస్తున్నారన్నారు. 1/70చట్టం ప్రకారం ఏజెన్సీలో గిరిజనులు ఇల్లు, షాపులు కట్టుకోవచ్చు అని తెలిపారు.హుకుంపేట కేంద్రంలో బతుకు తెరువు కోసం షాపు కట్టడానికి గిరిజనుడైన గొల్లోరి వెంకట రమణ పునాదులు వేస్తే వెంటనే నిలుపుదల చేయడం దుర్మార్గమైన చర్య అని వారు అన్నారు. గిరిజనేతర మహిళ కొండమ్మ దర్జాగా షాపు కడితే రెవెన్యూ శాఖ సహకరిస్తుందన్నారు. గతంలో బుడ్డిగా కొండమ్మ షాపు నిర్మాణం నిలుపుదల చేసి, ఇప్పుడు ఎలా అనుమతి ఇచ్చారని రెవిన్యూ అధికారులను వారు ప్రశ్నించారు.హుకుంపేటలో రాళ్ళ గెడ్డ వద్ద సంపద తయారీ కేంద్రానికి ఆనుకొని 20 సెంట్లు, దాలిగుమ్మడి చెరువు గట్టులో 20 సెంట్ల స్థలాన్ని అధికార వైసీపీ నాయకుడు దర్జాగా ఆక్రమణనలకు పాల్పడితే రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్రలో ఉందన్నారు. ఇకపై అక్రమ నిర్మాణాలు చేపడితే ఊరుకునేది లేదన్నారు. తక్షణమే అక్రమ నిర్మాణాలు కూల్చాలని, లేకుంటే అఖిలపక్షం కూలుస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు తాపుల కృష్ణారావు, కిల్లో రామరావు, వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు, సీపీఎం మండల నాయకులు తమర్బ అప్పలకొండ పడాల్, బిఎస్పీ మండల అధ్యక్షుడు పూజారి రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు వంతాల గాసన్న, నాయకులు సుర్ర సోంబాబు, ఎన్.మత్స్యరాజు, జనసేన నాయకులు సీహెచ్ రాజు, టీడీపీ యువ నాయకులు శంకర్ నాయుడు, వైసీపీ నాయకులు పి.పెంటన్న పాల్గొన్నారు.

వామపక్ష నేతల అరెస్టుపై నిరసన

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రజల పక్షాన నిలబడే వామ పక్షాల నేతలను అరెస్టు చేయడం తగదని, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ అమర్ తెలిపారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో అక్రమ అరెస్టులను ఖండిస్తూ అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అమర్ మాట్లాడుతూ, మోడీ రాష్ట్రానికి మేలు చేయకపోగా విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడానికి నిర్ణయించడం దారుణమన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విభజన హామీలు అమలు చేసి, ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు నిధులు ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కనీసం నోరు విప్పకపోగా ప్రశ్నిస్తున్న వామ పక్షాలను అణచి వేయడంపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి ఆటో యూనియన్ నాయకులు తేజ, హరి, రమేష్, కొండబాబు, సన్యాసిరావు, శివశంకర్, సాయి, శ్రీను పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఎఐటియుసి నేతలు

చర్మ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి


విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత పృథ్వీరాజు

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలో గిరిజన ఆశ్రమ ఉన్నత బాలికల, బాలుర పాఠశాలలను శనివారం గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కొమ్మ పృధ్వీరాజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు తల్లాబు కౌసల్య సందర్శించారు. విద్యార్థులు గజ్జి ,తామర, దురద వంటి చర్మ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని, వీరికి సంబంధించిన సూచనలు తెలిపారు.సీతగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న కోర్ర జగన్ విద్యార్థికి శరీరంపై ఎర్రటి కురుపులు వచ్చి తీవ్ర ఇబ్బంది పడుతుందన్నారు. ప్రతి ఏడాది శీతకాలంలో విద్యార్థులు తీవ్రమైన చర్మ వ్యాధులతో బాధ పడుతుంటారని, వీటి నివారణ కోసం ప్రభుత్వం చొరవ చూపించ లేదని విమర్శించారు. అమ్మ ఒడి పేరుతో కాస్మోటిక్‌ను ఇవ్వడం మానేశారన్నారు.

కిముడు దేవి సేవలు మరువలేం

- గిరిజన సంఘం ఘన నివాళి

ప్రజాశక్తి -పాడేరు: ఏపీ గిరిజన మహిళా సంఘం అధ్యక్షురాలిగా కిముడు దేవి అందించిన సేవలు, మహిళల సమస్యల పట్ల ఆమె చూపిన చొరవ మరువరానివని, ఆమె మృతి తీరని లోటని గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ తెలిపారు. దేవి స్వస్థలమైన తాజంగిలోని అడ్డాల వీధిలో సంతాప సభ శనివారం ధనుంజయ్ అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కోర్ర త్రినాథ్ మాట్లాడుతూ, కిమ్ముడు దేవి మహిళా సంఘం లో పనిచేస్తూ అతి తక్కువ కాలంలోనే మహిళల మన్ననలు పొందాలని కొనియాడారు. మహిళలకు జరిగిన అనేక సమస్యల పరిష్కారంలో దేవి కీలక పాత్ర వహించి న్యాయం జరగడానికి కృషి చేశారన్నారు. ఆమె ఆశయాలు నిలబెట్టినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు.తాజంగి మాజీ సర్పంచ్ పెనుమాల కాంతమ్మ మాట్లాడుతూ, ఆడపిల్లలపై జరుగుతున్న అన్యాయంపై దేవి పోరాటం చేశారన్నారు.ఈ కార్యక్రమంలో బాబురావు, వార్డు మెంబర్ సదాశివరావు, ముంచంగిపుట్టు మండలం వైస్ ఎంపీపీ సత్యనారాయణ, సిపిఎం నాయకులు రాందాస్, గ్రామ పెద్దలు, మహిళలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



'బాదుడే బాదుడు'లో మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : కిడారి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వైసిపి అసమర్ధత పాలనతో గిరిజనాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ విమర్శించారు. మండలంలోని పోతంగి పంచాయతీ పరిధిలోని జాముగుడ, బిజమరవలస, అమలగుడలో శనివారం టిడిపి మండల అధ్యక్షులు తుడుము సుబ్బారావు ఆధ్వర్యంలో బాదుడే బాదుడు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ్ మాట్లాడుతూ, జీఓ 3ను వెంటనే పునరుద్ధరించాలని, ఈ విషయమై ఎమ్మెల్యేలు, ఎంపీ నోరు మెదపక పోవటం దుర్మార్గమన్నారు. అమలగుడ గ్రామంలో కల్వర్టు లేక ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 18 వేల కేసులు పరిష్కారం

- జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షులు శ్రీదేవి

ప్రజాశక్తి-లీగల్ విలేకరి : జిల్లా వ్యాప్తంగా లోక్ అదాలత్ ద్వారా 18 వేలు కేసులు పరిష్కారమై రూ.20 కోట్లను కక్షిదారుకు అందజేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ అధ్యక్షులు జి.శ్రీదేవి తెలిపారు. విశాఖ జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్‌లో లోక్ అదాలత్‌ను శనివారం ఆమె ప్రారంభించి ప్రసంగించారు. కేసుల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ మూడో స్థానంలో నిలిచిందన్నారు. లోక్ అదాలత్ తీర్పులు శాంతికి సుస్థిరంగా నిలుస్తాయని, కక్షిదారులు బేషజాలకు పోకుండా తమ కేసులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయంతో లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా కోర్టు ప్రాంగణాలలో జాతీయలోక్ అదాలత్ అట్టహాసంగా ప్రారంభమై అత్యధిక కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. కక్షిదారులు సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి తిరుమలరావు, బార్ కౌన్సిల్ మెంబర్ బైపా అరుణ్‌కుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వైద్యుల రవీంద్రబాబు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బులికృష్ణ పాల్గొన్నారు.